www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 22 నవంబర్ 2023
5
వైఎస్ఆర్

స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి

కడప అర్బన్ : నగర అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ కూడళ్లలో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య నగర కార్యదర్శి డి. ఎం. ఓబులేసు, నాయకులు యస్.ఎం.డి.యూసఫ్ కోరారు. మంగళవారం కార్పొరేషన్ కమిషనర్ చాంబర్లో సూర్య సాయి ప్రవీణ్ చంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం చాలా సంవత్సరాల కాలంగా రోడ్ల విస్తరణ లేక, అభివృద్ధి పనులు జరగక ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిన నేపథ్యంలో మొట్ట మొదటిసారిగా కడప కార్పొరేషన్‌కు ఐఎఎస్ కమిషనర్‌గా ఒక అడుగు ముందుకు వేసి రోడ్ల విస్తరణ కూడళ్ల అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. కమిషనర్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కూడళ్లలో దేశం కోసం తమ ప్రాణాలను కూడా లెక్కచేయకుండా పోరాడి అమరులైన సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు.

టిడిపిలో ఆధిపత్య పోరు

కడప ఇన్‌ఛార్జి వర్సెస్ వ్యతిరేకులు
వేర్వేరుగా పార్టీ కార్యక్రమాల నిర్వహణ
తాజాగా చంద్రబాబును కలిసిన మాజీ ఇన్‌ఛార్జి

టిడిపిలో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. కడప టిడిపి టికెట్ ఆశావహులైన టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.మాధవిరెడ్డి, మాజీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబు, సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి మధ్య తారా స్థాయిలో విభేదాలు కొనసాగుతుండడం కేడర్‌ను కలవరపరుస్తోంది. బాబుతో నేను, భవిష్యత్ గ్యారెంటీ, యువనేత నారా లోకేష్ పర్యటన, పార్టీలో చేర్పులతో కూడిన కార్యక్రమాల నిర్వహణలో ఎవరికి వారుగా వ్యవహరిస్తుండడం విభేదాలు కొట్టొచ్చినట్లు కనిపించడం తెలిసిందే. ముగ్గురు నేతల మధ్య నెలకొన్న విభేదాలు కేడర్‌ను గందరగోళానికి గురిచేశాయని చెప్పవచ్చు. టిడిపి అధిష్టానం శాస్త్రీయమైన సర్వే ఆధారంగా టికెట్ కేటాయిస్తే గట్టిపోటీనిచ్చే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

2024 సార్వత్రిక ఎన్నికలు సమీపించిన నేపథ్యంలో అధిష్టానం చోద్యం చూస్తుండడం కేడర్‌ను గందరగోళం నెలకొంది. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియామకం, టికెట్ కేటాయింపుల వ్యవహారంలో ఆర్.మాధవిరెడ్డి వర్సెస్ లక్ష్మిరెడ్డి, అమీర్‌బాబు మధ్య ట్రయాంగిల్ ఫైట్ నడుస్తోంది. మాజీ ఇన్‌ఛార్జి అమీర్‌బాబును చంద్రబాబు పిలిపించుకుని మాట్లాడడం చర్చనీయాంశంగా మారింది. నాన్‌లోకల్ వ్యక్తులకు టికెట్ ఇస్తే గెలిచే అవకాశాలు లేవని సూటిగానే చెప్పినట్లు సమాచారం. మైనార్టీ నియోజకవర్గంలో ముస్లిమేతరులకు టికెట్ ఇస్తే ప్రత్యర్థులకు వరంగా మారతుందని వివరించినట్లు తెలిసింది. ఇదేతరహాలో సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి బృందం చంద్రబాబును కలిసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

పొరుగుపైనా ప్రభావం

కడపలో నాన్‌లోకల్ అభ్యర్థులకు టికెట్లు ఇవ్వడం వల్ల పార్టీ బలహీన పడుతుందని, దీని ప్రభావం పొరుగు నియోజకవర్గమైన కమలాపురంపై పడే అవకాశం ఉంది. అధికార పార్టీ అభ్యర్థులు కడప కేంద్రంగా రాజకీయాలు నెరపుతుండగా, ప్రతిపక్ష టిడిపి ఎన్నికలు పూర్తవగానే ఇతర ప్రాంతాలకు వెళ్లే నాయకులకు టికెట్లు ఇస్తే పార్టీ కేడర్ గందరగోళానికి గురవుతుందనే వాదన వినిపిస్తోంది. పూర్తి స్థాయిలో రాజకీయాలు చేసే వ్యక్తులకు టికెట్లు ఇవ్వకుండా పార్ట్‌టైమ్ రాజకీయాలకు, కాంట్రాక్టర్లు, పారిశ్రామిక వేత్తలకు టికెట్లు ఇవ్వడం వల్ల పార్టీకి తీవ్రనష్టం వాటిల్లుతోందనే వాదన వినిపిస్తోంది.

అధిష్టానానికి ఫిర్యాదుల పరంపర

ఇటీవల టిడిపి అధిష్టానం తరుపున జిల్లాకు వచ్చిన ఓ నాయకునికి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకులు బృందంగా కలిసి గట్టిగానే చెప్పినట్లు సమాచారం. ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ఇంటింటికి వెళ్లి చాపకింద నీరులా ప్రజల్లోకి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేస్తుండడం గమనార్హం. ప్రభుత్వ వ్యతిరేక ఓటును తగ్గించుకునే ప్రయత్నంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రతిపక్ష టిడిపి టికెట్ల కోలాటంలో కేడర్‌ను గందరగోళంలోకి నెడుతుండడం విస్మయాన్ని కలిగిస్తోంది.

సర్వేలపై సందేహాలు

టిడిపి అధినాయకత్వం శాస్త్రీయంగా సర్వేలు చేయడం ఎందుకని, నచ్చిన వారికి టికెట్లు ఇస్తే సరిపోతుంది కదా అనే వ్యంగ్యమైన మాటలు వినిపిస్తోంది. నాలుగు నుంచి ఐదు శాస్త్రీయ సర్వే బృందాలు ఏమి సూచించినట్లనే వాదన వినిపిస్తోంది. సర్వేల ద్వారా టికెట్లు కేటాయిస్తామని చెప్పిన హామీ అమలు చేయాలని, అప్పుడు గట్టి పోటీని ఇవ్వవచ్చనే వాదన కేడర్ నుంచి వినిపిస్తోంది. సర్వేల ప్రకారం నడుచుకోని పక్షంలో చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా ఉంటుందనే నర్మగర్భమైన సూచనలు వంటి హెచ్చరికలు వాదన అన్ని వైపుల నుంచి వినిపిస్తోంది. టిడిపి అధినాయకత్వం జిల్లాపై స్పష్టమైన, శాస్త్రీయమైన వైఖరితో ముందుకెళ్తేనే ప్రయోజనం ఉంటుందని చెప్పవచ్చు.

మున్సిపల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం ఇవ్వాలి

జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్ డిమాండ్
కలెక్టరేట్ ఎదుట ఆందోళన, వంట వార్పు

వంట వార్పులో మున్సిపల్ కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ కార్మికులకు పనికి తగ్గ వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, హెల్త్ రిస్క్ అలవెన్స్, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా గౌరవ అధ్యక్షులు మనోహర్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టి వంటవార్పు కార్యక్రమానికి సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బి. మనోహర్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కోవిడ్ -19 కార్మికులను ఆప్కాస్‌లో చేర్చాలని పేర్కొన్నారు. పిహెచ్ డ్రైవర్లకు హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఆడిషనల్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ వర్తింపజేయాలని తెలిపారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18500 వేతనం చెల్లించాలని చెప్పారు. డ్రైవర్లకు రూ.32,500 ఇవాలని, ఎలక్ట్రీషియన్ సిబ్బందికి స్కిల్డ్,సెమీ స్కిల్డ్ జీతాలు ఇవ్వాలని, తడిచెత్త, పొడిచెత్త వేరు వేరు చేయించడంలో కార్మికులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్ర సందర్భంగా మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల మొండి వైఖరిని వీడి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో డిసెంబర్ మొదటి వారంలో నిరవధిక సమ్మెకు కార్మికులు సిద్ధం అవుతారని హెచ్చరించారు. అప్పటికీ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయకపోతే ఆమరణ నిరాహార దీక్షకి సిద్ధపడుతామని ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికుల పోరాటానికి ఎల్ఐసి డివిజనల్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దస్తగిరి రెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యం, జిల్లా కార్యదర్శులు సుంకర రవి, గోపి, ఆనంద్, విజయ్, తిరుపాల్, బీరు విజయ్ కుమార్, కిరణ్, పుల్లయ్య, నాగరాజు, చంటి, ఓబులేసు, ఆదాం, ఆనంద్, శివ, శేఖర్, శ్రీధర్, రాఘవ శ్యామ్, మహిళా కార్మికులు, నాయకులు పవన్, డివైఎఫ్ఐ నాయకులు విజయ్, యూసఫ్ , ఉదయ్ పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు అండ : చైర్మన్

మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

ప్రజాశక్తి - కడప

'వైఎస్ఆర్ మత్స్యకార భరోసా' పథకం మత్స్యకార కుటుంబాల్లో ఆర్థిక భరోసాను నింపుతోందని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి. శివ ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా తీర ప్రాంత మత్స్యకారులకు ఒన్‌జిసి బాధితులకు పరిహారాన్ని అందజేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు స్థానిక కలెక్టరేట్ స్పందన హాలు నుంచి జిల్లా ఫిషరీస్ డిడి రామలింగాచార్యులు తోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట సుబ్బమ్మ, జిల్లా మత్స్యకార సంఘం ఉపాధ్యక్షులు జమాలయ్య, జిల్లా ఇన్‌ఛార్జి మత్స్యశాఖాధికారి ఏ. కిరణ్ కుమార్ హాజరై హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకార కుటుంబాల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. మన జిల్లాలో సుమారు 12 వేల హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న 156 మైనర్ ఇరిగేషన్ చెరువులను, 6 రిజర్వాయర్‌లను, జిల్లాలోని 30 మత్స్య సహకార సంఘాల వారికి తక్కువ ధరలకె లీజుకు కేటాయిస్తున్నారని చెప్పారు. జిల్లాలో 3 పెద్ద జలాశయాల్లో మత్స్యకారులకు వేట చేసుకోవడానికి స్వల్ప రుసుంపై లైసెన్సుల జారీ చేశారన్నారు. కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు, ఫిషరీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బహిష్కరించిన మత్స్యకారుల సంఘం నాయకులు

కడప అర్బన్ : నాలుగేళ్లుగా ప్రభుత్వం ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా మత్స్యకారుల సంక్షేమానికి చేసిన కృషి శూన్యం. గత ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సారథ్యంలోనే మత్స్యకారులకు అండదండగా నిలవడమే కాక అభివృద్ధిలో పెద్దపీట వేశారని టిడిపి బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ పేర్కొన్నారు. వేడుకలను తూతు మంత్రంగా నిర్వహించడంతో తాము సమావేశాన్ని బహిష్కరించినట్లు స్పష్టం చేశారు. చెప్పిన సమయానికి కన్నా రెండు గంటల పాటు ఆలస్యంగా సమావేశాన్ని ప్రారంభించడమే కాక సంక్షేమంపై వివరాలు చెప్పకుండా ముఖ్యమంత్రి జగన్ ఉపన్యాసానికే ప్రాధాన్యం ఇవ్వడం దురదృష్టకరమన్నారు. టిడిపి ప్రభుత్వంలో మత్స్యకారుల దినోత్సవానికి ఎంతో ప్రాధాన్యత ఉండేదని పేర్కొన్నారు. బహిష్కరించిన వారిలో మత్స్య సహకార సంఘం నాయకులు బోలా సుబ్బరాయుడు, మల్లె సుబ్బయ్య, మానా చంద్రశేఖర్, ఆవుల వెంకటేష్, వర్ది బోయిన రాము, జింకా సుక్రివ ఉన్నారు.

జగనన్నా.. జాబ్ కేలండర్ ఎక్కడ? : డివైఎఫ్ఐ

కడప అర్బన్ : జగనన్న జాబ్ కేలెండర్ ఎక్కడని, యువత ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని, శివకుమార్ తెలిపారు. మంగళవారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో ఖాళీ పోస్టుల భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలు దాటినా ఇంతవరకు ఎన్ని జాబ్ క్యాలెండర్లువిడుదల చేశారని ప్రశ్నించారు. గ్రూప్స్, మెగా డిఎస్‌సి కోసం చదువుకున్న నిరుద్యోగులు సంవత్సరాల కొద్ది కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటూ వయో భారంతో ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత కోల్పోతూ బలవన్మరణాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలు మరో ఆరు నెలలు రానున్నాయని ఇంత వరకు ఉద్యోగాల నోటిఫికేషన్లు లేవన్నారు. ఉద్యోగాల భర్తీ అడిగితే నిర్బంధాలతో ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతోందన్నారు. ఖాళీ పోస్టుల భర్తీ కోసం భవిష్యత్‌లో నిరుద్యోగ యువతతో పోరుబాట పట్టాలన్నారు. సమావేశంలో నగర అధ్యక్షులు షాకీర్, జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం దత్తత తీసుకోవాలి

కడప : నియమ నిబంధనల ప్రకారం దత్తత తీసుకోవాలని ప్రత్యేక దత్తత సంస్థ, జిల్లా స్త్రీ, శిష్యు అభివృద్ధి సంస్థ మేనేజర్ ఎం. కుమారి అన్నారు. మంగళవారం ఆశా కార్యకర్తలు, సిబ్బందికి అంతర్జాతీయ దత్తత మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ దత్తత కార్యక్రమాన్ని, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహిస్తుందని తెలిపారు. ప్రతి దంపతుల కోరికను దత్తత కార్యక్రమం ద్వారా బిడ్డలను పొందే వరాన్ని ప్రభుత్వం అందించటం చాలా సంతోషకరమని చెప్పారు. కార్యక్రమంలో సోషల్ వర్కర్ పద్మిని, ఎంఒడి భారతి, పిహెచ్‌టి ఎం.రుతూ, సుకన్యా, నర్స్ .బి.కుమారి పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే బిసిలకు న్యాయం

కడప : బిసిలకు వారికి న్యాయం చేసింది సిఎం జగన్మోహన్‌రెడ్డి ఒక్కరే అని బిసి జెఎసి రాష్ట్ర కన్వీనర్, టిటిడి పాలకమండలి సభ్యులు సిద్ధవటం యానాదయ్య అన్నారు. రామచంద్ర యాదవ్‌కు చిత్తశుద్ధి ఉంటే బిసిలకు అన్యాయం చేసిన చంద్రబాబుపై కేసు పెట్టాలన్నారు. మంగళవారం వైసిపిజిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యానాదయ్య మాట్లాడారు.ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌పై బిసివై పార్టీ అధ్యక్షులు రామచంద్రా యాదవ్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. 1.65 లక్షల కోట్ల అవినీతి చేశారని ఫిర్యాదు చేయడం హాస్యాస్పదం అన్నారు. కేవలం ప్రచారం కోసమే కుట్రలు పన్నుతున్నారని వాపోయారు. ప్రజాదరణ కలిగిన నాయకులపై అదే పనిగా దుష్ప్రచారం చేయడం సరి కాదన్నారు.

'లావాదేవీలు నిరూపించలేమన్న సిఐడి'

కడప అర్బన్ : కోర్టుకు ప్రాథమిక ఆధారాలు చూపియ్యలేని ప్రభుత్వం, సిఐడి అధికారులు మరో సారి చంద్రబాబు నాయుడును కక్ష పూరితంగా హింసిస్తున్నారని ప్రజలకు అర్థమైందని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.370 కోట్లు నగదు రూపంలో తీసుకుని అవినీతికి పాల్పడ్డారన్న అరోపణకు సిఐడి ఎలాంటి సాక్ష్యాలు చూపించలేకపోయిందన్నారు. శరత్ అండ్ అసోసియేట్స్ సమర్పించిన ఫోరెన్సిక్ ఆడిట్ రిపోర్టుపై సిఐడి విపరీతంగా ఆధార పడింది కానీ, ఆ నివేదికే సవాలక్ష షరతులతో వచ్చిందని, వాటిపై ఆధారపడి ఒక నిర్ణయానికి రాలేమని కోర్టు పేర్కొందని చెప్పారు. ఒప్పందాల్లో తేడాలుంటే దానికి సిఎం ఎలా బాధ్యులు అవుతారని కోర్టు స్పష్టం చేసిందన్నారు. సమావేశంలో మైనారిటీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజూరు అహమ్మద్, ఖాజా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

పొలాన్ని పరిశీలిస్తున్న ఎఒ

కడప సిటీ : వరి పంటలో వ్యాపించే తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ శాఖాధికారి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పాత కడప, చౌటపల్లి వ్యవసాయ పొలాల్లో పర్యటన సందర్భంగా మాట్లాడారు. కాండం తొలుచు పురుగు, ఆకుచుట్టు పురుగుల నివారణకు రెండు గ్రాముల కార్బన్ హైడ్రోక్లోరైడ్ మందును పిచికారీ చేయాలని, దోమ నివారణకు ఒక ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్, లేదా 0.5 ఎంఎల్ దయామిల్ క్సామ్ ధయామిల్ మందును లీటరు పిచికారీ చేయాలని సూచించారు. దీంతోపాటు రబీలో ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలన్నారు. నువ్వులు, వేరుశనగ, మినుములు, ప్రొద్దుతిరుగుడు, రాగి, మొక్కజొన్న, జొన్న పంటలను బోర్ల కింద సాగు చేసుకోవాలన్నారు కార్యాలయంలో ఎఇఒలు పావని,మెహరాజ్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

పోరుమామిళ్ల : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బొజ్జ రోషన్న పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని రంగసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని ఆది ఆంధ్ర పాలెం గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మహిళలు , యువకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలు మహాశక్తి ,యువగళం,అన్నదాత ,ఇంటింటికి నీరు, పూర్ టు రిచ్, బీసీ రక్షణ చట్టం గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

రేపు సామాజిక సాధికారత బస్సు యాత్ర

కడప : నగరంలో ఈనెల 23న నిర్వహించే సామాజిక సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని వైఎస్ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు జాషువా, నగర అధ్యక్షులు నాగరాజు, సుదర్శన్ రాయల్ పిలుపునిచ్చారు. మంగళవారం వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సామాజిక సాధికారత బస్సు యాత్రలో మంత్రులు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, కడప జడ్‌పి చైర్మన్ ఆకెపాటి అమర్‌నాథరెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆదిమూలపు సురేష్. మేరుగ నాగార్జున, మాజీ ఎంపీ బుట్టారేణుక, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ కంభాల రవికుమార్, సినీ నటుడు అలీ హాజరవుతారన్నారు. . సమావేశంలో రాష్ట్ర నాయకులు ఫక్రుద్దీన్, రాష్ట్ర మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, జిల్లా నాయకులు శ్రీరాములు, సుదర్శన్ రాయల్, సెల్వం ఆచారి, ఈశ్వర్ బాబు, ఈస్వరయ్య, మరియలు, శ్రీదేవి, నరసింహ, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు ఇన్వర్టర్ వితరణ

కడప : కెనరా బ్యాంక్ 118వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం సామాజిక బాధ్యతగా నగరంలోని శంకరాపురం అంధుల పాఠశాలకు ఇన్వర్టర్, సీలింగ్ ఫ్యాన్స్, బ్రెయిలీ స్క్రిప్ట్ రైటింగ్ డ్రాయింగ్ షీట్స్‌ను రీజనల్ మేనేజర్ కె. మురళీమోహన్ వితరణ చేశారు. అనంతరం గాలిదేవర ఆంజనేయ స్వామి దేవాలయానికి కెనరా బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యతగా గోద్రెజ్ అలమారాను బహుకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అబ్దుల్ మునాఫ్, డివిజనల్ మేనేజర్ ఎ.వి.రాజశేఖర్, మేనేజర్ ఎం.ఓబులేసు, జి. పవన్ కుమార్ పాల్గొన్నారు.

రగ్బీ రాష్ట్ర జట్టుకు పునీత్ రాజ్ ఎంపిక

కడప : ఆంధ్రప్రదేశ్ ఎస్‌జిఎఫ్ రాష్ట్ర రగ్బీ జట్టుకు బాలుర జడ్‌పి హైస్కూల్, చెముమియాపేట విద్యార్థి ఎస్. పునీత్ రాజ్ ఎంపికయ్యారు. ఇటీవల కర్నూల్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల ఎస్‌జిఎఫ్ అండర్ -14 విభాగంలో పునీత్‌రాజ్ మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. డిసెంబర్ నెలలో ఒరిస్సాలో జరిగే పోటీలలో పాల్గొంటారు. రాష్ట్ర జట్టుకు పునీత్ రాజ్ ఎంపిక కావడం పట్ల స్కూలు ప్రధానోపాధ్యాయురాలు గిరిజా కమారి, ఫిజికల్ డైరెక్టర్ ప్రవీణ్ కిరణ్, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

వల్లూరు : గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, ముగ్గుల పోటీల్లో విజేతలకు మంగళవారం గ్రంథాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా గ్రంథాలయాలను సందర్శించి విలువైన పుస్తకాలను చదవి మేదస్సును పెంచుకోవాలని సూచించారు. శ్రీ యాదాల శేషగిరి మెమోరియల్ స్కూల్ కరస్పాండెంట్ వంకధార ఆంజనేయులు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలని, విద్యార్థులు పుస్తకాలను చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ప్రవీణ, ఎఒ ఉత్తమరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిన సిఎం : టిడిపి

కడప అర్బన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంపద సృష్టించలేక, రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. ద్వారకా నగర్‌లోని ఆయన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్ర బాబును అక్రమ కేసుతో జైలుకు పంపితే ఇక టిడిపి ఉండదని, తిరిగి గెలవడానికి జగన్ కుట్ర రాజకీయాలు చేశారని విమర్శించారు. 45 ఏళ్ల అవినీతి ఎరగని చంద్రబాబుకు హైకోర్టు 39 పేజీల రెగ్యులర్ బెయిల్ ఆర్డర్ ఇవ్వడం అంతిమ తీర్పుగా చెప్పవచ్చున్నారు. ప్రతిపక్షాలను అణగ దొక్కడానికి ఈ ప్రభుత్వం చంద్రబాబును 52 రోజులు అన్యాయంగా అక్రమ కేసులో జైల్లో పెట్టిందని తెలిపారు. టిడిపి కార్యక్రమాలకు ఒక్క రూపాయి నిధులు విడుదల కాలేదని నిరూపణ అయిందని చెప్పారు. అంతిమ తీర్పు 20 24 లో ప్రజలు నిర్ణయిస్తారని చెప్పారు **టిడిపి నాయకులపై కేసులు పెట్టాలన్నదే వైసిపి కుట్ర :** ఎలాగోలా టిడిపి నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టించాలన్నదే లక్ష్యంగా వైసిపి నాయకులు కుట్రలు పన్నుతున్నారని కడప నియో జకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రెడ్డప్ప గారి మాధవి పేర్కొన్నారు. ద్వారక నగర్‌లో ఆమె నివా సంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టిడిపి వారికి చెందిన ఆస్తుల వద్ద వైసిపి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు.

ఎల్ఐపి శిక్షణను ఉర్దూలో నిర్వహించాలి

డిప్యూటీ సిఎంకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కడప అర్బన్ : సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో తలపెట్టిన ఎల్ఐపి శిక్షణను ఉర్దూ ఉపా ధ్యాయులకు ఉర్దూ భాషలో ఇవ్వాలని రూట నాయకులు మంగళవారం ఉప ముఖ్యమంత్రి అంజద్ బాషకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రూట రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి అయూబ్ మాట్లాడుతూ ఉర్దూ మాధ్యమ ఉపాధ్యాయులకు తెలుగు మాధ్యమంలో శిక్షణ ఇవ్వడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని చెప్పారు. రూట వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్ల మాట్లాడుతూ విద్యాశాఖాధికారులు ప్రతి సారి ఉర్దూ భాషను విస్మరిస్తున్నారని చెప్పారు. స్పందించిన ఉప ముఖ్యమంత్రి ఫోన్ ద్వా రా ఈ విషయం పై రాష్ట్ర విద్యా అధికారులతో చర్చించి వారి సూచన మేరకు ఉర్దూ మీడియంలో ఎల్ఐపి శిక్షణ ఇస్తామని, ఉర్దూ మాడ్యూల్‌ను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు.

పిల్లలందరూ బడిలోనే ఉండాలి

మాట్లాడుతున్న డిఇఒ రాఘవరెడ్డి

ప్రజాశక్తి -కడప అర్బన్

బడి ఈడు పిల్లలందరిని వంద శాతం పాఠశాలల్లో నమోదు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి వై. రాఘవరెడ్డి, సమగ్ర శిక్ష పతక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని సభా భవనంలో జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు, ఎంఐఎస్, డేటాఎంట్రీ, కంప్యూటర్ ఆపరేటర్లు, సచివాలయ వార్డు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు వంద శాతం జిఇఆర్ (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) సాధనకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్లు వాలంటీర్స్ సహాయంతో పాఠశాల వయసున్న పిల్లలందరినీ పాఠశాలల్లో వంద శాతం నమోదు చేయించాలని ఆదేశించారు. 1-12 తరగతుల (18 సం.)వయసున్న పిల్లలు కచ్చితంగా పాఠశాలల్లో నమోదు అయ్యేలా చూడాల్సిన భాద్యత మనపై ఉందన్నారు. దేశ భవిష్యత్తు కోసం, పిల్లల అభివృద్ధి కోసం వారికి అందాల్సిన సంక్షేమ ఫలితాల కోసం వందనమోదు కావాలన్నారు. బాల్య వివాహాలు అరికట్టే దిశగా చర్యలు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది బ్రహ్మానంద రెడ్డి పాల్గొన్నారు.

మెలకువలు నేర్చుకోవాలి

కడప : అడవులలో, ఎడారి ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న గుర్తింపు చిహ్నాలు ఆధారంగా లక్ష్యాలను చేరుకోవడంలో మెలకువలను కేడెట్లు నేర్చుకోవాలని ఎన్‌సిసి 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ తాప అన్నారు. కడప నగరంలోని తెలుగు గంగా కాలనీలో నిర్వహిస్తున్న 12వ కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంపులో భాగంగా మంగళవారం క్యాంపు డిప్యూటీ కమాండెంట్ డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ కనీస సమయ వ్యవధిలో ల్యాండ్ మార్క్‌లను గుర్తించడం, దూరాన్ని నిర్ధారించే పద్ధతులను ఉపయోగించి సులభంగా లక్ష్యాన్ని చేరుకోవడం వంటి అంశాలపై కేడెట్లకు శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు మహేష్, రాజు పరేడ్ శిక్షకులు సుబేదార్ అశోక్, బిస్నోయ్, సి.ఎల్.రెడ్డి, జగదీష్, కొండా రెడ్డి ఆఫీసు సిబ్బంది సూపరిండెంట్ సరస్వతి, డేవిడ్, ఉమ, ప్రియ, రాజగోపాల్ రెడ్డి, శివ ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు పెండ్లిమర్రిలో కోలాటం

కలసపాడు : మండలంలోని పెండ్లిమర్రి గ్రామంలో బుధవారం సరస్వతి పూల, కోలాటం నిర్వహించనున్నట్లు గురువు ముండ్లపాటి ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి పూజ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా శ్రీ హంస అవార్డు గ్రహీత ఎస్.భజన పుల్లయ్య, భజన గురువు, నాయన పల్లి ఓబులేసు, సిరిగిరి పల్లె, నారాయణరెడ్డి, మఠం గురయ్యా, గురువు బాల గురయ్య, హాజరవుతారన్నారు. కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఎంపిడిఒ మహబూబ్‌బీ, జడ్‌పిటిసి అంకన గురువిరెడ్డి, ఎంపిపి నారాయణ, మాజీ ఎంపిపి సుధా, రామకృష్ణారెడ్డి, మండల వైసిపి అధ్యక్షుడు సగిలి సుదర్శన్, జెసిఎస్ మండల కన్వీనర్ చిత్త రాజశేఖర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, పలువురు గ్రామ కమిటీ పెద్దలు, సర్పంచ్, రాజకీయ ప్రముఖులు వస్తారన్నారు.

పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధా

ఇంటింటా సంక్షేమం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కలసపాడు

జగన్ పాలనలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ సుధా పేర్కొన్నారు. మండలంలోని రామాపురంలో మంగళవారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె ప్రతి ఇంటికి వెళ్లి వారికి అందుతున్న పథకాల అమలుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడచిన నాలుగున్నర ఏళ్లల్లో జగనన్న మేనిఫెస్టోలో పొందిపరిచిన ప్రతి ఒక్క పథకాన్ని అమలు చేశారని చెప్పారు. మండలానికి అనేక కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. ముఖ్యంగా ప్రజల సమస్యలను పుష్కరించేందుకోసం సచివాలయం, ఆరోగ్య కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని రకాలుగా ప్రజలను అందు కుంటున్నామని చెప్పారు. రానున్న 2024వ ఎన్నికల్లో తిరిగి జగనన్న ప్రభుత్వాన్ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, దీనికి క్షేత్రస్థాయి నుండి అందరం కలిసికట్టుగా పనిచేసి విజయాన్ని చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి అంకన్న గురివిరెడ్డి, ఎంపిడిఒ మహబూబ్‌బీ, ఎంపిపి బోధన బోయిన నారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు సగిలి సుదర్శన్, మండల మాజీ ఎంపిపి సుధా రామకృష్ణారెడ్డి, జెసి ఎస్‌సి కన్వీనర్ చిత్త రాజశేఖర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి మురారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

కడప : సీనియర్ వైసిపి నాయకులు, వైఎస్ జగన్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం కడప జడ్‌పి కాంపౌండ్‌లోని ప్రేమాలయ నిరాశల వసతి గృహంలో అనాథలకు, పేదలకు అన్నదానం చేశారు. ఈ సంద ర్భంగా దాత మాట్లాడుతూ కడప తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపికృష్ణ, సూర్య డెవలపర్స్ అధినేత కంచి సురేంద్రనాథ్ (సూరి) సహకారంతో పేదలకు అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకరాపురం అశోక్ కుమార్, వల్లి బాష, డి. సుబ్బరాయుడు, మాధవరెడ్డి, శివశంకర్, ప్రేమాలయ నిరాశల వసతి గృహ నిర్వాహకులు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అన్నదానం చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. నగర పంచాయతీ 1వ సచివాలయం పరిధిలోని 1, 20 కౌన్సిల్ వార్డు లకు సంబంధించి ఎమ్మెల్యే ఆధ్వ ర్యంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన వైసిపి జెండాను ఆవిష్కరించారు. కౌన్సిలర్లు అలీ, ప్రశాంత్, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ ను ఎన్నో విధాలా అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని వైసిపి నాయకులు వైఎస్ మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పులివెందుల మునిసిపాలిటీ పరిధిలోని బయమ్మ తోట సచివాలయం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వైఎస్ మనోహర్‌రెడ్డి కార్యక్రమం నిర్వహించారు. పురపాలక చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్‌రెడ్డి , జేసియస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్, కౌన్సిలర్స్ ఖాదర్, కాంతమ్మ గారి ఆధ్వర్యంలో సచివాలయ పరిధిలో ప్రజలకు అందిన సంక్షేమ పథకాల జాబితా, వాటి మొత్తం రూ.30 కోట్లకు సంబంధించిన బోర్డింగ్, పార్టీ జెండాను మనోహర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వార్డ్ కౌన్సిలర్ కోడి రమణ, గాజుల శైలజ, రవి, సచివాలయ కన్వీనర్లు సోమశేఖర్, నవీన్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బంకు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వలేదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఆటోస్టాండ్‌లో ఏర్పాటు చేసిన బంకునకు జమ్మలమడుగు సబ్ రిజిస్ట్రార్ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని సిఐటియు పట్టణ కార్యదర్శి విజయ్ అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలోని సబ్ రిజిస్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఆదివారం షేక్ షేక్షావలి అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆటో స్టాండ్ లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి బంకును ఏర్పాటు చేశారన్నారు. బంకు ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆటో కార్మికులు ప్రభుత్వ స్థలంలో అక్రమంగా బంకు ఏర్పాటు చేయడం సబబు కాదని ప్రశ్నించగా సబ్ రిజిస్ట్రార్ తనకు స్థలం కేటాయించారని చెప్పారన్నారు. సదరు సబ్ రిజిస్ట్రార్ అధికారిని సిఐటియు ఆధ్వర్యంలో కలవగా తాను బంకు ఏర్పాటుకు షేక్షావలి అనే వ్యక్తికి ఎలాంటి అనుమతులు ఇవ్వ లేదన్నారు. రెవెన్యూ అధికారులతో చర్చించి వెంటనే బంకును తొలగించేలా చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు కోరారు. అధికారులు స్పందించి బంకును వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమేష్, మారి, రాజేష్, వెంకటయ్య, విజయ పాల్గొన్నారు.

వినతిపత్రమిస్తున్న సిఐటియు నాయకులు

గండికి పాదయాత్ర

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలో అయ్యప్పస్వామి మాలధారులు మంగళవారం నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు గుర్రప్ప ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మఠం నుండి కాలినడకన గండి వీరాంజనేయ స్వామి దర్శనానికి వెళ్లారు. కార్యక్రమంలో గురుస్వామి శ్రీనివాసులు, నారాయణ యాదవ్, అశోక్‌కుమార్, శివారెడ్డి, ఓబులేసు, మురళి, రామాంజనేయులు, శివ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

నాగరాజు కుటుంబానికి 'రెడ్యం' పరామర్శ

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని నాగసానిపల్లెకు చెందిన అయ్యప్ప భక్తుడు పోలం నాగరాజు యాదవ్ కుటుంబాన్ని మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి రిమ్స్‌లో చికిత్స పొందుతూ నాగరాజు మృతిచెందిన విషయం విదితమే. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధం సుబ్బారాయుడు యాదవ్, మాజీ ఎంపీటీసీ నక్కా వెంకట సుబ్బయ్య యాదవ్, టిడిపి నేత దాది బోయిన గురుప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై వ్యాఖ్యలు అర్థరహితం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి రామచంద్ర యాదవ్‌కు లేదని వైసిపి విద్యార్థి విభాగం పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి జశ్వంత్‌రెడ్డి, కో-ఆప్షన్ చంద్రమౌళి అన్నారు. స్థానికంగా మంగళవారం వారు విలేకరులతో మాట్లా డుతూ రాష్ట్ర, కడప, పులివెందుల అభివృద్ధి గురించి రామచంద్ర యాదవ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమ న్నారు. కళ్లు తెరచి రాష్ట్ర మంతా తిరిగితే అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉందో తెలుస్తుందన్నారు. నవరత్నాలు అన్నీ కూడా 98 శాతం నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రౌడీయిజం చేసే వాళ్లయితే నువ్వు పులివెందుల వరకు వచ్చి సిఎం జగన్ మీద ఫిర్యాదు చేసి వెళ్లేవాడివా.. అది తెలుసుకో అని సూచించారు. వైఎస్ కుటుంబం ప్రజాస్వామ్యానికి విలువనిచ్చే వారు కాబట్టే పులివెందుల వచ్చి మీ లాంటి వాళ్లు పిచ్చి ప్రేలా పనలు చేస్తున్నారని పేర్కొన్నారు. మహిధర్, యోహాన్, కిరణ్ పాల్గొన్నారు.

అధికారపక్షాన్ని విమర్శించడమే టిడిపి పని

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కొన్నేళ్లుగా అధికారంలో ఉండి ఎలాంటి అభివృద్ధిని చేయకపోగా.. అధికారపక్ష వైసిపిని రాష్ట్రస్థాయి నుండి నియోజకవర్గ స్థాయి వరకు టిడిపి నాయకులు విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహ ఆవరణలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ పాలనలో సంక్షేమం మాట సరే అభివృద్ధి ఏది అని విమర్శిస్తున్న టిడిపి నాయకులపై ఆయన మండిపడ్డారు. చంద్రబాబు మోసపూరిత మాటలు వింటే ప్రజలు నట్టేట మునిగినట్టేనన్నారు. ప్రజలను మోసగించిన చంద్రబాబు రాష్ట్ర భవిష్యత్తుకు భరోసానా అని ఎద్దేవా చేశారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయపేట

శాశ్వత నిత్యాన్నదాన పథకానికి కడప నగరం ఓం శాంతి నగర్‌కు చెందిన గోశెట్టి తిమ్మగారి మదన్‌కుమార్ జ్ఞాపకార్థం వారి తల్లిదండ్రులు చిన్న మాదన్న, రమాదేవి మంగళవారం రూ.1,00,116 విరాళం ఇచ్చారు. ఆలయ అర్చకులు కేసరి స్వామి, రాజా స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుంద రెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్ తెలిపారు.

క్రైం కార్నర్

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మైదుకూరు-ప్రొద్దుటూరు జాతీయ రహదారి కేతవరం వద్ద మంగళవారం తెల్లవారుజామున ఎడ్ల బండిని వెనక వైపున లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎడ్ల బండిపై వెళుతున్న ఎన్. ఓబాయపల్లెకు చెందిన చంద్రశేఖర్ గాయపడ్డాడు. రెండు ఎద్దు గాయపడ్డాయి. సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు.

దెబ్బతిన్న ఎడ్ల బండి

రంధ్రం.. జరభద్రం..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యానికి అధ్వానంగా తయారైంది. నాకేంటి.. నాకేం లాభం.. అన్నట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎర్రగుంట్ల మున్సిపాలిటీ పరిధిలో ఐసిఎల్ కర్మాగారం నుంచి కడప రోడ్డులోని రైల్వేట్రాక్ వరకు నిర్మించిన జాతీయ రహదారి సంవత్సరం తిరగకముందే ఎన్నిసార్లు ప్యాచ్‌వర్క్‌లు చేశారో లెక్కేలేదు. పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారి నడిరోడ్డులో గత నెలలో ఐదు అడుగుల రంధ్రం ఏర్పడింది. సంబంధిత అధికారులు ఆ రంధ్రాన్ని పూడ్చి తూతూ మంత్రంగా ప్యాచ్‌వర్క్ చేశారు. నెల తిరగకమునుపే అదే స్థానంలో మళ్లీ రంధ్రం ఏర్పడింది. ఈ జాతీయ రహదారిని చూసి స్థానిక ప్రజలు నవ్వుకుంటున్నారు. నాణ్యమైన రోడ్లు వేయించాల్సిన అధికారులు కాంట్రాక్టర్లతో, నాయకులతో కుమ్మక్కై నాసిరకమైన రోడ్ల నిర్మాణం చేసినా.. పట్టించుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. సమాచార చట్టం ద్వారా జాతీయ రహదారి అధికారులు అందించిన వివరాల మేరకు ఎర్రగుంట్ల పరిధిలో నిర్మించిన జాతీయ రహదారిపై సూచిక బోర్డులు 41 ఏర్పాటు చేయవలసి ఉండగా 32 బోర్డులు మాత్రమే ఏర్పాటు చేశారు. ఇలా ప్రతి చిన్న విషయం నుంచి కూడా కాంట్రాక్టర్లకు మేలు జరిగేలా.. నాణ్యతా ప్రమాణాలు పాటించని అధికారులపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని ప్రజలు కలెక్టర్‌ను కోరుతున్నారు.

జాతీయ రహదారిపై ఏర్పడిన రంధ్రం

సుపరిపాలన అందిస్తున్న సిఎం జగన్

వైఎస్ఆర్ సభా భవనాన్ని ప్రారభిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర ప్రజలకు సిఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. వేంపల్లెలో దాదాపు రూ.4 కోట్లతో మంగళవారం నూతనంగా నిర్మించిన అభివృద్ధి పనుల భవనాలను ఎంపీ అవినాష్‌రెడ్డి ప్రారభించారు. ముందుగా రెడ్డయ్య కాలనీ సమీపంలో రూ.2 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ బిసి బాలుర వసతిగృహాన్ని ఎంపీ ప్రారభించారు. అనంతరం బిడ్డాలమిట్ట ప్రాంతంలో రూ.30 లక్షలతో నిర్మించిన పశు ప్రాంతీయ వైద్యశాలను ప్రారభించారు. ఎంపిడిఒ కార్యాలయం సమీపంలో రూ.40 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రాలను, రూ.1.15 కోట్లతో నిర్మించిన వైఎస్ఆర్ సభా మందిరాన్ని ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సిఎం జగన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. అయా గ్రామాల్లో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం వైఎస్ఆర్ సభా భవనంలో ప్రజాదర్బార్ నిర్వహించి, ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను స్వీకరించారు. అక్కడికక్కడే సమస్యలపై అధికారులతో ఫోన్‌లో చర్చించారు. అనంతరం గండి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలను ఎంపీ పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. సకాలంలో పనులు పూర్తి చేస్తే సిఎంచే ప్రారంభించేందుకు వీలుంటుందని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, ఎపిఐఐసి డైరెక్టర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, మండల కొఆప్షన్ మెంబర్ ఉసేనయ్య, బిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్ యాదవ్, అయ్యవారిపల్లి సర్పంచ్ రామగంగిరెడ్డి, రోడ్డు భవనాల శాఖ ఇఇ సిద్దారెడ్డి, పంచాయతీ రాజ్ డిఇ రవిచంద్రారెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, కాణిపాకం దేవస్థానం డైరెక్టర్ కొండయ్య, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు బిఎస్ షెక్షావలి, హౌజ్ హౌస్ డైరెక్టర్ మునీర్, ఎంపిటిసిలు కటిక చంద్రశేఖర్, భారతి, రహంతుల్లా, గౌరిదేవి బలిజ సంఘం అధ్యక్షులు కుళాయప్ప, ఎంపిడిఒ దివిజా, ఇఒపిఆర్డి మల్లికార్జునరెడ్డి, విద్యుత్ ఎడి శ్రీకాంత్, ఇడుపులపాయ మాజీ సర్పంచ్ పోతిరెడ్డి చలపతి, రోడ్డు భవనాల శాఖ ఎఇ వెంకటరమణ, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపయోగపడని సమావేశాలెందుకు..?

- సాధారణ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

కౌన్సిల్ ఎజెండాలో ప్రజలకు ఉపయోగపడే అంశాలు కాకుండా అనవసరవి పొందుపరచి సమావేశాలు నిర్వహించడం ద్వారా ప్రజలకు ఉపయోగం ఏమిటని కౌన్సిలర్లు ప్రశ్నించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సాధారణ కౌన్సిల్ సమావేశాన్ని చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కౌన్సిలర్ అలీ మాట్లాడుతూ మంచినీటి సంపు వద్ద నీటి మోటరు మరమ్మతులకు గురై మంచినీటి సరఫరాలేక ప్రజలు ఇబ్బందులుపడుతున్నా పట్టించుకోలేదన్నారు. దాదాపు పది లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసి కొన్న ట్రాక్టర్ డోజర్, క్లీనింగ్ మిషన్లను ఎందుకు నిరుపయోగంగా ఉంచారని ప్రశ్నించారు. పట్టణంలో పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నా, తమను ఎవరూ ఏమీ చేయలేరని వాటి యజమానులున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 11వ వార్డు కౌన్సిలర్ రషీద్ మాట్లాడుతూ 70 మీటర్ల మేర తాగునీటి పైపులైను మార్చాలని పలమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. మంచినీరు కలుషితమై ప్రజలు రోగాల పాలవుతున్నారని తెలిపారు. పట్టణంలో దోమలు విపరీతంగా ఉన్నాయన్నారు. కనీసం ఫాగింగ్ కూడా చేయడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం ఫాగింగ్ యంత్రానైనా పంపాలని, సొంత డబ్బులతో వార్డులో ఫాగింగ్ చేస్తామని అన్నారు. అధికారుల స్వప్రయోజనాల కోసం ఉపయోగించే బిల్లులు వస్తున్నాయే కానీ, అభివృద్ధి పనులకు ఖర్చు చేసిన బిల్లులు రావడంలేదని కౌన్సిలర్ అలీ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ స్థలంలో ఉన్న ఊరబావి స్థలాన్ని నడివూరు రామాలయానికి దారాదత్తం చేయుటకు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దినసరి మార్కెట్ గేటు 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.7,13,294 నగర పంచాయతీకి చెల్లించాల్సి ఉండగా, కాంట్రాక్టర్ బాలాంజనేయరెడ్డి చెల్లించకపోవడంతో చట్టపరమైన చర్యలు తీసుకునేలా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో కమిషనర్ జగన్నాథ్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో సమస్యలను చెబుతున్న కౌన్సిలర్లు

మెనూ పాటించడం లేదు : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని నాగలకట్ట ఎస్‌సి కళాశాల హాస్టల్లో భోజనం మెనూ పాటించడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.వినయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని కొన్ని ప్రయివేటు కళాశాలల్లో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కొంతమంది హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతూ సమస్యలు ఉంటే చెప్పాలన్నారు. కొందరు విద్యార్థినులు నాగులకట్ట ఎస్‌సి కళాశాల హాస్టల్‌లో భోజనం మెనూ పాటించడం లేదని తెలిపారున్నారు. ఒకే రకం భోజనం పెడుతున్నారని, తినలేక కాలేజికి వెళ్లి టిఫిన్ చేయాల్సి వస్తోందని తెలిపారని అన్నారు. ఉన్న కూరగాయలతోనే వండి పెడుతున్నారని తెలిపారు. ఈ హాస్టల్ విషయమై గతంలో ఎఎస్‌డబ్ల్యూపై చర్యలు తీసుకుంటామని తెలిపారని, కానీ ఇప్పటివరకు అమలు కాలేద న్నారు. ఎఎస్‌డబ్ల్యు విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రఘు రాముడు, హుస్సేన్‌మియా, ఇమామ్, రాజేష్, నాయక్, నరేంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నిండు నూరేళ్ల జీవితాన్ని అర్ధాంతరంగా ముగింపు పలికే రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ట్రాఫిక్ సిఐ యుగంధర్ అన్నారు. స్థానిక వైయంఆర్ కాలనీలోని శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా మంగళవారం 'సేఫ్‌ఆన్‌రోడ్' కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల నుండి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సిఐ మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు తప్పనిసరగా డ్రైవింగ్ లైసెన్స్ పొందాలన్నారు. లైసెన్స్ తీసుకున్న తర్వాతనే వాహనాలు నడపాలన్నారు. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్, అంతకుపైబడి వాహన చోదకులు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. నూతన చట్టం మేరకు ఎలక్ట్రికల్ వాహనాలకు 16ఏళ్లు పైడితే లైసెన్స్ పొందేందుకు అర్హులు అన్నారు. ప్రిన్సిపల్ రహమతుల్లా మాట్లాడారు. కార్యక్రమంలో ఎజియం నాగిరెడ్డి, డీన్ పవన్‌కుమార్, 6 నుండి 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

వచ్చే నెల నుంచి ఇంటి వద్దకే సరుకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వచ్చే నెల నుంచి ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆర్‌డిఒ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎన్‌ఫోర్స్‌మెంట్ తహశీల్దార్, రేషన్ పంపిణీ వాహనాల డ్రైవర్లు, ఆర్ఐ, విఆర్ఒలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం 14 రేషన్ సరుకులను పంపిణీ చేసే వాహనాలు ఉన్నాయన్నారు. వీటి ద్వారా డిసెంబరు నుంచి ఇంటి వద్దకే సరుకులు పంపిణీ చేయాలని సూచించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఆంజనేయులు కార్యాలయం బయట మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు ఇతర వ్యక్తులకు బిల్లులు పెట్టడంలో అధికారులు వ్యత్యాసం చూపిస్తున్నారని ఆరోపించారు. బిల్లులు సక్రమంగా పెడితే వాహనాదారుడు కూడా నిత్యవసర సరుకులను పంపిణీ చేయడంలో అలసత్వం చూపన్నారు. అధికారులు వ్యత్యాసం లేకుండా బిల్లులు పెట్టాలని కోరారు.

ప్రతిభ చూపిన శివసాయి హైస్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - కొండాపురం

గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ శాఖ మండలస్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వ పోటీలో పట్టణంలోని శివసాయి గ్లోబల్ హైస్కూల్ విద్యార్థులు మొదటి మూడు స్థానాలను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ విద్యార్థులు తమలో ఇమిడి ఉన్న ప్రతిభను వెలికి తీయడం వల్ల వారి జీవితానికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను జిల్లా, రాష్ట్రస్థాయిలో కూడా కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సాంబశివ యాదవ్, ప్రధానోపాధ్యాయులు నందకిషోర్‌రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు

సింహాద్రిపురం : గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్యం అందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నేషనల్ క్వాలిటీ అసెస్మెంట్ స్టాండర్డ్(ఎన్‌క్యూఎఎస్) బృందం సభ్యులు డాక్టర్ సీమ, డాక్టర్ సుశీల్ దేవేంద్ర చౌహాన్ పేర్కొన్నారు. గురిజాలలో వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య పరికరాలు, మందులు, పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లా కో-ఆర్డినేటర్ రమేష్, బిదనంచెర్ల పిహెచ్‌సి వైద్యాధికారి ఖాజా ముద్దీన్ సాహెబ్, సిహెచ్‌ఒ రమాదేవి, శ్రీలీల, ఆశ వర్కర్లు పద్మావతి, రాజమ్మ పాల్గొన్నారు.

గౌరీదేవి మహోత్సవానికి తులసిరెడ్డికి ఆహ్వానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక జలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే గౌరీదేవి మహోత్సవానికి విచ్చేయాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డిని ఆహ్వానించారు. బలిజ సంఘం అధ్యక్షుడు కుళాయప్ప, చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తులసిరెడ్డిని కలిశారు. కార్యక్రమంలో ఎద్దుల రాము, నామా చెన్నకేశవ, నామా రవి, బాలం సుబ్బరాయుడు పాల్గొన్నారు.

బిజెపి ప్రాపకం కోసం పాకులాడడం సిగ్గు చేటు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రానికి అన్ని విధాలా అన్యాయం చేసిన బిజెపి ప్రాపకం కోసం ప్రాంతీయ పార్టీలైనా వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు పాకులాడడం సిగ్గుచేటని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిజెపి చేతిలో ఆ పార్టీలు కీలుబొమ్మలుగా మారాయని విమర్శించారు. బిజెపి దాని అనుబంధ పార్టీలైన వైసిపి, టిడిపి, జనసేనలకు ఓటు వేస్తే మన కన్ను మనమే పొడుచుకోవడం అవుతుందన్నారు. ప్రత్యేకహోదా ఇవ్వకపోవడంతోపాటు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజి అమలు చేయలేదన్నారు. విభజన చట్టంలోని ఏ అంశాన్ని కూడా అమలు చేయలేదని విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్రంలో కబ్జాలు, ఇసుక, మైన్స్, ఎర్రచందనం, ఎర్రమట్టి, సబ్సిడీ బియ్యం మాఫియాలు రాజ్యమేలుతున్నట్లు చెప్పారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తెచ్చేందుకు ప్రజలు సహకరించాలని తులసిరెడ్డి కోరారు.

కరువుపై సిఎంను ప్రశ్నించే ధైర్యం 'రాచమల్లు'కు ఉందా?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరును కరువు మండలంగా ఎందుకు ప్రకటించలేదని ముఖ్యమంత్రిని అడిగే ధైర్యం ఎమ్మెల్యే రాచమల్లుకు లేదని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి 150 మంది రైతులను వేసుకొని కలెక్టర్‌ను సన్మానించడం కేవలం పబ్లిసిటీ కోసమేనని విమర్శించారు. ప్రతి సంవత్సరం మైలవరం నుండి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. ఇప్పట్లో కొద్దోగొప్పో పంటలు వేస్తున్నారంటే మైలవరం నీటి ద్వారానేనని వరద చెప్పారు. జిల్లాను కరువు ప్రాంతంగా ముఖ్యమంత్రి ప్రకటించకపోవడం దారుణమన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉండే 9 మంది ఎమ్మెల్యేలకూ ముఖ్యమంత్రిని అడిగే దమ్ము, ధైర్యం ఎవరికీ లేదన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు బూటకపు మాటలు, అబద్దాలతో రైతులను మాయ చేస్తున్నారన్నారు. మైలవరం ఉపకాలువల్లో కూడికతీత పనుల్లో కూడా రాచమల్లుకు కమీషన్ ఇవ్వాలన్నారు. ఎన్నికల సమీపంలో రైతులపై లేని ప్రేమను వొలకబోస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, 14వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి టప్ప మహబూబ్ బాషా పాల్గొన్నారు.

రాష్ట్ర పరిస్థితి ఆర్థికంగా దిగజారిపోయింది : వరద

ప్రొద్దుటూరు : ముఖ్యమంత్రి జగన్ అసమర్థ పాలన వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అధ్వానంగా దిగజారిపోయిందని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలోని మోడంపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టిడిపి కడప పార్లమెంట్ కార్యదర్శి నాగ`మునిరెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటసాల వెంకటేశ్వర్లు, స్థానికులు పాల్గొన్నారు

ఘనంగా 'పుట్టా' పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ పుట్టినరోజు సందర్భంగా మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రాష్ట్ర ఐటిడిపి అధికార ప్రతినిధి కొండపల్లి ఉమాకాంత్ ఆధ్వర్యంలో వృద్ధులకు, రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఉమా కాంత్ మాట్లాడుతూ పుట్టా మైదుకూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆకుల కృష్ణయ్య, మేకల బాబు, శీర్ల నాగమోహన్, పెరుగు కృష్ణయ్య, బండి అమరనాథ్, తుపాకుల రమణ పాల్గొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి మైదుకూరు పట్టణ అధ్యక్షులు దాసరి బాబు ఆధ్వర్యంలో పుట్టా సుధాకర్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర రైతు విభాగం నాయకులు ధనపాల జగన్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ బిపి సుధాకర్‌రెడ్డి, టిడిపి నాయకులు క్రిష్ణయ్య, సుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన వేడుకలు సోమిరెడ్డిపల్లి టిడిపి మండల నాయ`డు ఎల్లటూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, నారాయణ, పూజా శివ య్య, పట్టాభి, ఈశ్వర్‌రెడ్డి, కల్లూరు దస్తులు, సిద్ధు, మస్తాన్, శ్రీను పాల్గొన్నారు.

ఖాజీపేట : మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ జన్మదిన కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక పిడబ్ల్యూడి బంగ్లా సమీపంలోని శివ భక్తేంద్ర ఆలయంలో టిడిపి నాయకులు, పత్తూరు గ్రామ ఉప సర్పంచ్ ముత్తూరు రమణ ఆధ్వర్యంలో కేక్ కోసి పంచి పెట్టి సంబరాలు చేసుకున్నారు. పుట్టా నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఫరూక్ అహ్మద్, పిచ్చి నాయుడు, హబీబ్, ఆవుల సుబ్బారాయుడు, నంద్యాల సుబ్బయ్య యాదవ్, రామ నాయుడు, నాయబ్, రామ సుబ్బారెడ్డి, మామిళ్లకృష్ణారెడ్డి, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు పల్లె గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

ఖాజీపేట : కార్యక్రమంలో టిడిపి నాయకులు

వైసిపి పాలనలో ప్రజలకు రక్షణలేదు

ఖాజీపేట : వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని, బడుగు బలహీన వర్గాలు మైనారిటీలు, దళితుల మాన,ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి, తెలుగుయువత జిల్లా అధికార ప్రతినిధి నేట్లపల్లి శివరామ్ యాదవ్, నియోజకవర్గం బిసి సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టె రాము యాదవ్ పేర్కొన్నారు. మండలంలోని పాటిమీదపల్లెలోని తుట్టే రాము యాదవ్ నివాసంలో మంగళవారం శివరామ్ విలేకరులతో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత అరాచకాలు, దాడులు అధికమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధికార చలామణి కలిగిన ఉన్నత పదవులు అన్ని కూడా ముఖ్యమంత్రి సామాజిక వర్గానికే ఇచ్చారన్నారు. ప్రాధాన్యత, నిధులు, విధులు, కూర్చోవడనికి కుర్చీల్లేని పదవులు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మైదుకూరులో చేపట్టిన బస్సు యాత్ర పూర్తిగా విఫలమైందని వారు విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచండి

జమ్మలమడుగు రూరల్ : నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచాలని అధికారులకు, బి ఎల్‌ఒలకు ఆర్డిఒ జి. శ్రీనివాసులు సూచించారు. స్థానిక ఆర్డిఒ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫారం-7లను ప్రస్తుతం ఆపాలన్నారు. ఫారం-6లు అధికంగా వస్తున్నాయని వాటిని పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రా లను పరిశీలించి సరైన మౌలిక వసతులు ఉన్నా యా లేవా గమనిం చాల న్నారు. లేని వాటిని గుర్తించి తమ దృష్టికి తెస్తే ఆ మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. 5న తుది ఓటరు జాబితా వస్తుందన్నారు. ఎలక్షన్ డిప్యూటీ తహశీల్దార్ షఫీ, తహశీల్దార్ గురప్ప, ఎలక్షన్స్ సీనియర్ అసిస్టెంట్ మస్తాన్‌వలి, వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

BEFORE THE HON'BLE JUNIOR CIVIL JUDGE, KADAPA
D.V.C. 65/2023

K.Mary Flarance, S/o P.Ravi Kumar, D.No.101-A, Silpasadam, Kadapa. ...Petitioner

Vs

P.Ravi Kumar, W/o Yesaiah, D.No.2/3, Yerraguntla Town, Kadapa Dist. ...Respondent

NOTICE

పై కేసులో వాది ప్రతివాదిపై గృహహింస కేసు పై కోర్టులో దాఖలుచేసియున్నందున, పై ప్రతివాది తప్పకుండా 23.11.2023వ తేదీన ఉదయం 10.30 గంIIలకు పై కోర్టులో ప్రతివాది కాని, ఆయన తరపు వకీలు గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినదిగా తెలుపడమైనది. లేనియెడల అతని పరోక్షములో కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

B.GURAPPA NAIDU
Advocate,
Kadapa.

IN THE COURT OF THE HONORABLE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE : KADAPA
O.S.No. 1003/2021

Anuguru Rama Chandra Reddy, S/o A.Yella Reddy, Hindu, aged 73 years, Residing at D.No. 96/43, Utukuru, Kadapa District.

...Plaintiff

Vs

1. Vagimalla Naga Malla Reddy, S/o V.Parvatha Reddy, Hindu, Aged 65 years, D.No.2/273-2, Balaji Nagar, Kadapa.
2. V.Devan, S/o V.Venkatappan, Hindu, Aged 50 years, D.No.1/111-3, Chemumiapeta, Kadapa.
3. P.Gangi Reddy, S/o P.Obula Reddy, Hindu, Aged 68 Years, D.No.1/111-2, Chemumiapeta, Kadapa.

...Defendants 4,5,6

ప్రతివాదులు 4,5,6 నోటీసు

పై తెలిపిన దావాలో వాది, ప్రతివాదులైన మీపై ఇంజక్షన్ కోరుతూ దావా దాఖలు చేసిఉన్నారు. సదరు దావాలో మీకు ఏవైనా అభ్యంతరాలు ఉన్న యెడల 24/11/2023 ఉదయం 10.00 గంటలకు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయి, మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనంతట పరోక్షంగా తీర్మానించబడును.

V. RAMA MOHAN, B.A.,B.L.,
K. RAMA MOHAN, B.A.,B.L.,
B.N.AKBAR ALI KHAN, B.A.,B.L.,
M. SPANDANA, B.Tech.,B.L.,
న్యాయవాదులు, కడప.